

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ఎల్వీ ప్రసాద్

### (విజయచిత్ర – 1994, ఆగస్టు సంచిక నుంచి )


‘నే నెలా దర్శకుడినయ్యానంటే....?’

–ఎల్.వి.ప్రసాద్

ఒక వ్యక్తి ప్రగతికి నేపథ్యంలో ఎంత కృషి ఎన్ని సాధక బాధకాలు ఉంటాయన్నది ఈతరం వారికి తెలియజేయాలన్న ఉద్దేశంతో (జూన్ 22న మద్రాసులో దివంగతులైన) సుప్రసిద్ధ దర్శక, నిర్మాత ఎల్.వి. ప్రసాద్ తాను ఎలా దర్శకుడు అయ్యారో వివరిస్తూ 'కినిమా' (సెప్టెంబర్, 1952)లో స్వయంగా రాసిన వ్యాసాన్ని ఇక్కడ పునః ప్రచురిస్తున్నాము.

మాది పెద్ద రైతు కుటుంబం. నేనట్టే చదువుకోలేదుగాని కాడిగట్టి పొలం దున్నాను. అయితే 1929 ఆఖరు దినాలలో మా కుటుంబం ఆర్ధిక పరిస్థితులు విషమించి తలవంపులుగా యెంచబడే పని జరిగింది. మా నాయనగారు దివాళా పిటిషన్ పెట్టవలసి వచ్చింది. దానిమీద సంతకం పెట్టేసి, ఆ రాత్రే నూరు రూపాయలు తీసుకుని, నా భార్యా బిడ్డలకు సైతం చెప్పకుండా బొంబాయి బయలుదేరాను. నాకు బాగా జ్ఞాపకం నేను ఇల్లు విడిచినది 1929లో, బొంబాయి చేరింది 1930లో.

బొంబాయి చేరి దాదర్ లో ఒక హోటల్ లో మకాం పెట్టాను. నాకంతా అయోమయం, ఎవరితోనూ మాట్లాడటానికి లేదు. నాకు వచ్చిన ఇంగ్లీషు బహుకొద్ది. హిందూస్థానీ, మరాఠీ భాషలు అసలేరావు. నాదుస్థితి కనిపెట్టి యెవడో నా పెట్టెలో వున్న డబ్బు కొట్టేసి 20 రూపాయలు మాత్రం వదిలేశాడు. ఎందుకో నాకప్పుడర్థం కాలేదు.

తరవాత నేను ఒక సినిమా కంపెనీకి మేనేజరుగా వుండగా ఈ మనిషే నా దగ్గరికి వేషం కోసం వచ్చి, నన్ను చూసి ఆశ్చర్యపడి, “ఇంకా నువ్విక్కడే వున్నావా? నీ తిరుగు రైలు ఛార్జీ 20 రూపాయలు ఉంచానే?” అన్నాడు. నా సంగతి వాడెరగడు. ఇంటికి ఉత్తరం ముక్క రాయకుండా, నా ఆచూకీ నా భార్యా బిడ్డలకు తెలియకుండా నేను బొంబాయిలో 21 మాసాలు గడిపాను. తిరిగి నా వార్తలు మా వాళ్లకూ, వాళ్ల వార్తలు నాకూ తెలిసేలోగా నా కుమార్తె చనిపోవటం కూడా జరిగింది ...

బొంబాయిలో దిగిన కొత్తలో రోజూ కోహినూరు సినిమాకు వెళ్ళి గేటు దగ్గర నిలబడి లోపలికి చాలా సేపు ఆశగా చూసి హోటలకు తిరిగివచ్చేవాణ్ణి. కాని దగ్గర వున్నది 20 రూపాయలు ఎంతకాలం వస్తాయి. హోటలువాడు నాకు ఉద్వాసన చెప్పాడు. ఈ విధంగా వీధిలో నిలబడిన నాకు ఒక దర్జీవాడు ఆశ్రయమిచ్చాడు. నా పెట్టె ఆ దర్జీకొట్టులో వుంచాను. రాత్రివేళ కొట్టులో పడుకునేవాణ్ణి. తెల్లవారి లేచి కొట్టంతా శుభ్రంగా ఊడ్చేవాణ్ణి. నాకు సినిమాలో ప్రవేశించాలని వుందని తెలిసి ఈ దర్జీవాడే నాకి వీనస్ పిక్చర్స్ లో పని యిప్పించాడు. పేరుకు నెల జీతం 15 రూపాయలు కాని, ఈ జీతం డబ్బుల మోహం నేనెన్నడూ చూసిన పాపాన పోలేదు. ఈ వీనస్ పిక్చర్స్ వారు చిత్రమే తీయలేదు.

అయినా ఒక ఉపకారం జరిగింది. ఆ రోజుల్లో మిసిమాతీ అని ఒక సినిమాతార వుండేది. ఈమె సోదరుడు ధారీలాల్ అనేవారు వీనస్ పిక్చర్స్ లో వుండేవాడు. ఇతను నాకు గ్రాంట్ రోడ్డులో వుండే కార్నీవాల్ లో పని యిప్పించాడు. రాత్రిళ్ళు అక్కడ పనిచేసి, కార్నివాల్ ముగిసిన తర్వాత రెండు గంటల వేళ ... బస్సులూ, ట్రాములూ వుండవు .. నాలుగైదు మైళ్ళు దాదరుకు నడిచి దర్జీ దుకాణం చేరి, అక్కడ కాస్సేపు పడుకుని, మళ్ళీ 6 గంటలకు లేచి కొట్టు శుభ్రం చేసి, రైలు మీద శాంతాక్రూజ్ లో వీనస్ పిక్చర్స్ కు హాజరయేవాణ్ణి. కార్నివాల్ వాళ్ళు నాకు రోజూ రూపాయిన్నర ఇచ్చేవారు. దీనితోనే నా ఖర్చులన్నీ సరిపెట్టుకునేవాణ్ణి. 3, 4 నెలలు గడిచాక వీనస్ పిక్చర్స్ దివాళా తీసింది.

తరవాత అఖ్తర్ నవాజ్ కు చెందిన ఇండియా పిక్చర్స్ లో చేరి “స్టార్ ఆఫ్ ది ఈస్ట్” అనే మూకీ చిత్రంలో చిల్లర వేషం వేశాను. ఆ రోజుల్లో చిల్లర నటుల చేత వెట్టి చాకిరీ చేయించేవారు. ఎక్కడికైనా పోతే సామాన్లు మొయ్యాలి, రిఫ్లెక్టర్లు మొయ్యాలి. వట్టి కూలిపని, ఒకసారి అఖ్తర్ నవాజ్ షూటింగుకని మమ్మల్ని యెక్కడో మారుమూల స్థలానికి తీసుకుపోయాడు. రైలు స్టేషనుకు 15 మైళ్ళ దూరాన ఒక రహదారి బంగాళాలో మకాం చేశాం. దగ్గర డబ్బులేదో యేమో అఖ్తర్ నవాజ్ రాత్రికి రాత్రే మాకెవరికీ చెప్పకుండా పరారీ అయినాడు. మా పాట్లు పరమాత్ముడికెరుక. రెండు రోజులు యెవరికీ తిండి లేదు. ఆ తరవాత 15 మైళ్ళు నడిచి స్టేషనుకు చేరి, చావు తప్పి కన్ను లొట్టబోయి, యెట్లాగో బొంబాయి వచ్చిపడ్డాం.

ఆ తరువాత ఆర్దేషిర్ ఇరానీ కింద ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో నెలకు ముప్పై రూపాయల జీతం మీద నటుడుగా చేరాను. ఈ ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో దాదాపు రెండేళ్ళున్నాను. ఈ కాలంలోనే వీరు మొట్టమొదటి

భారతీయ టాకీ చిత్రం “ఆలం ఆరా” తీశారు. ఇందులో నేను చిల్లర వేషాలు వేశాను. నేను ఇంపీరియల్ లో ఉండగానే నాకు హెచ్. ఎం. రెడ్డి గారి పరిచయం కూడా అయింది. ఆయన అక్కడికి వచ్చి “కాళిదాస్” అనే చిన్న టాకీ చిత్రం హిందీలో తీశారు. ఇందులో నేను పురోహితుడి పాత్ర ధరించాను.

1933లో కాబోలు ఇంపీరియల్ కంపెనీలో ఉద్యోగులను తగ్గించారు. దాంతో నేను వీధిలో వచ్చిపడ్డాను. నా నిరుద్యోగానికి తెరమరుగులాగా కృష్ణా సినిమాలో డోర్ కీపర్ పని దొరికింది. ఈ పనిచేస్తూనే హెచ్. ఎం. రెడ్డి గారి “భక్తప్రహ్లాద” లో చండామర్కులు వేషమూ, “సావిత్రి” లో సత్యవంతుడి మిత్రుడి వేషమూ వేశాను.

అనంతరం రెడ్డిగారు దాదర్ లోని విజయా సినీటోన్ లో “సీతా స్వయంవర్” అనే హిందీ చిత్రాన్ని డైరెక్టు చెయ్యటానికి కుదిరారు. ఆ చిత్రంలో నేను వేషం వేశాను. చిత్రం పూర్తి కాక పూర్వమే కంపెనీ వారికీ రెడ్డిగారికి ఏవో విభేదాలు ఏర్పడి ఆయన వెళ్ళిపోయారు. నేను మాత్రం చిత్రం పూర్తి అయిన దాకా కంపెనీలో ఉండి, టన్నులు పట్టుకొని బొంబాయి రాష్ట్రమంతటా తిరిగాను. తరవాత నేనా కంపెనీకి ఆఫీసు మేనేజరు కూడా అయినాను. అయితే కొద్ది రోజులకే ఈ కంపెనీ రద్దయింది.

ఇక్కడి నుండి నేను న్యూ పిక్చర్స్ కి వెళ్లాను. దాని ప్రొప్రయిటరు రజనీకాంత్ పాండ్య, ఈయన ప్రస్తుతం బొంబాయి శ్రీ సౌండ్ స్టూడియోస్ కు అధిపతి, న్యూ ఈరా వారు అప్పుడు తీయనున్న “మత్స్యగంధి" (భీష్మప్రతిజ్ఞ) చిత్రానికి నన్ను ప్రొడక్షన్ మేనేజరుగా నియమించారు. ఈ చిత్రం పూర్తి కాగానే రేణుకా పిక్చర్స్ (దాదర్) లో చేరాను. ఈ కంపెనీ వారు ఒక కెమెరా, సౌండ్ ట్రాక్ కొని చిత్రాలు తీయబోతున్నారు. ఈ కంపెనీకి నేను మెనేజరుగానూ, అసిస్టెంటు కెమెరామెన్ గానూ కుదిరాను. 1937లో జన్నూదాస్ కపాడియా కింద “స్త్రీ” అనే చిత్రానికి కెమెరా పని చేశాను.

నాకు అసిస్టెంటు డైరెక్టర్ అవకాశాన్ని మొదటగా ఇచ్చిన వారు గజన్ ఫరాలీషా, ఇతను భయంకరుడు. కోపం వచ్చినప్పుడల్లా పిస్తోలు తీసేవాడు. (అతనికి పిస్తోలు లైసెన్స్ ఉండేది) అతని కింద ఎవరూ అసిస్టెంటుగా పనిచెయ్యలేక పోయేవారు. కాని నేను అతనికింద పనిచేసినంతకాలం అతనితో నాకు ఏ పేచీ రాలేదు. ప్రస్తుతం గజన్ ఫరాలీషా అనే ఆయన పాకిస్తాను మంత్రిగా ఉన్నట్టున్నది. ఈయనే ఆయనేమో నాకు తెలియదు.

ఒక కంపెనీ అని లేకుండా దొరికిన చోటనల్లా చిల్లర వేషాలు వేస్తూ బొంబాయిలో మరి రెండేళ్ళు గడిపిన అనంతరం 1940లో హెచ్. ఎమ్. రెడ్డిగారు నన్ను మద్రాసుకు తీసుకొచ్చారు. ఆయనకు సహాయంగా ఉంటూ “సత్యమే జయం” “తెనాలి రామకృష్ణ” చిత్రాలలో వేషాలు కూడా వేశారు.

తిరిగి 1942లో తాండ్ర సుబ్రహ్మణ్యంగారు “కష్టజీవి” తీయటానికి బొంబాయి బయలుదేరితే దాన్ని డైరెక్టు చేయటానికి నేనూ వెంట వెళ్ళాను. ఈ చిత్రం మూడు రీల్సు పూర్తి అయినాక ఆగిపోయింది. నేను గీతాంజలి పిక్చర్స్ కు అసిస్టెంటు డైరెక్టరుగా చేరి “సవాల్” అనే చిత్రానికి పనిచేశాను. ఇందులో ముంతాజ్ శాంతీ, ఉల్లాస్ ప్రధాన పాత్రలు

ధరించారు. దీని తరువాత ముంతాజ్ శాంతీ భర్త వల్లీ సాహిబ్ "లేడీ డాక్టర్" డైరెక్షనుకు కుదిరినప్పుడు నేనాయనకు అసిస్టెంటూగా పనిచేశాను.

తరువాత డైరెక్టర్ యూసఫ్ నన్ను అసిస్టెంటుగా తీసుకున్నాడు. "దర్బాన్", "నేక్పర్వీన్" చిత్రాలు తీశాము. కుమార్ తీసిన "దేవర్" చిత్రానికి స్క్రిప్ట్ రాశాను.

ఇంతలో పృధ్వీరాజ్ కపూర్ పృధ్వీ ధియేటర్స్ పెట్టి నాటకాలాడ నారంభించాడు. మొదట "శకుంతల" ఆడాడు. తరవాత "దీవార్". ఈ రెండు నాటకాలలోనూ నేను అనేక చిన్న పాత్రలు ధరించాను.

1945 ఆగష్టులో, "గృహప్రవేశం" చిత్రం డైరెక్టు చేయటానికి మద్రాసు వచ్చి ఇక్కడి సినిమా ప్రపంచంలో ఒక డైరెక్టరుగా స్థిరపడి పోయాను.

ఏతావాతా చెప్పవచ్చిందేమంటే నేను అష్ట కష్టాలన్నీ బొంబాయిలోనే పడ్డాను. బొప్పిలన్నీ అక్కడే తగిలాయి. కాని నేర్చుకోవలసిందంతా కూడా అక్కడే నేర్చుకున్నాను. బొంబాయి ముఖ్యంగా నాకు ఓపిక నేర్పింది. ఏమైనా సాధించాలంటే ఎంతో ఓపిక అవసరం. ముఖ్యంగా ఈ సినిమా లైనులో తొందరపాటువల్ల ఏమీకాదు.

(రచనా కాలం – 1952)

★★★

COMMENTS